సాక్షి
ప్రకాశం
శుక్రవారం । 25 । జూలై । 2025



సిగ్నల్ పూర్.. జనం బేజార్.!

నల్లమల అటవీ ప్రాంత సమీపంలో ఉండే ప్రజలకు మొబైల్ సిగ్నల్స్ అందక అవస్థపడుతున్నారు. ఫోన్లు మాట్లాడాలంటే కొండలు, గుట్టలు ఎక్కాల్సి వస్తోందని వాపోతున్నారు.

- 8లో..



మూగజీవాల అపహరణ

మర్రిపూడి పరిసరాల్లో వారం వ్యవధిలో రూ.18 లక్షల విలువైన 16 పశువులు అపహరణకు గురయ్యాయి. వాహనాల్లో ఎక్కించి తీసుకెళ్లిన ఆనవాళ్లు ఉన్నాయి.

- 8లో..

గరిష్టం/కనిష్టం
31 /25

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

27న ఎయిడెడ్ పోస్టు భర్తీకి పరీక్ష

ఒంగోలు సిటీ: ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని బల్లికురవ మండలం వల్లపల్లి గ్రామంలో గల సీపీ అప్పర్ ప్రైమరీ స్కూల్లో ఖాళీగా ఉన్న ఎస్జీటీ ఎయిడెడ్ పోస్టు భర్తీకి ఈ నెల 27వ తేదీ నరసరావుపేట ఇంజినీరింగ్ కాలేజీ, నరసరావుపేట ఇంజినీరింగ్ కాలేజీ అటానమస్ బ్లాక్-4లో పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈఓ కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు రెండో సెషన్ జరుగుతుందని వెల్లడించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులంతా పరీక్ష కేంద్రానికి హాల్ టికెట్లతో పాటు ఏదైనా గుర్తింపు కలిగిన ధ్రువీకరణ పత్రంతో ఒక గంట ముందుగా హాజరుకావాలని కోరారు.

పోలీస్ కస్టడీకి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

పొదిలి: అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలను గురువారం పోలీస్ కస్టడీకి అనుమతించారు. పొదిలి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో వాయిదా రోజైన గురువారం కార్యకర్తలను హాజరుపరిచారు. జూనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష ఆరుగురు కార్యకర్తలను పోలీస్ కస్టడీకి అనుమతినిస్తూ తీర్పు చెప్పారు. క్రైం నంబర్ 51-2025లో శాగం రవీంద్ర, చొప్పరపు రామాజంనేయులు, క్రైం నంబర్ 52-2025లో కోనేటి వెంకట శివ, కోనేటి రాజశేఖర్, పూని వెంకటేశ్వర్లు, షేక్.సుభానీలను పోలీస్ కస్టడీకి అనుమతించారు. న్యాయవాది సమక్షంలో విచారణ చేయాలని తీర్పులో పేర్కొన్నారు. దీంతో కార్యకర్తలను ముందుగా వైద్య పరీక్షల నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తదుపరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పార్టీ లీగల్ సెల్ సభ్యుడు ధర్నాసి రామారావు సమక్షంలో గురువారం ఉదయం 10 నుంచి శనివారం ఉదయం 10 గంటల వరకు కార్యకర్తలను పోలీసులు విచారణ చేయనున్నారు.

కన్నీళ్లు దాటుకుని..!



కంభం మండలంలోని రావిపాడులో ఆఖరి మజిలీకి కూడా అవస్థలు తప్పడం లేదు. గ్రామంలో ఎవరైనా చనిపోతే దహన సంస్కారాలు చేసేందుకు శ్మశానానికి గుండ్లకమ్మ వాగు దాటి వెళ్లాలి. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో వాగులో ఉధృతంగా నీరు ప్రవహిస్తుంటుంది. అలాంటి సమయంలో గ్రామంలో ఎవరైనా చనిపోతే వారి కుటుంబీకుల బాధలు వర్ణనాతీతం. ఇటీవల వర్షాలు కురవడంతో వాగులో మోకాలి లోతు నీరు ప్రవహిస్తోంది. గురువారం గ్రామంలో ఎల్లమ్మ అనే వృద్ధురాలు మృతి చెందడంతో ఆమె బంధువులు, కుటుంబ సభ్యులు వాగులో నుంచే అష్టకష్టాలు పడుతూ మృతదేహాన్ని మోసుకెళ్లారు. కొందరు వాగు దాటలేక అవతలి ఒడ్డునే ఉండిపోయారు. ఇక్కడ వంతెన నిర్మించాలని ఎన్నో పర్యాయాలు అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

– కంభం

నిధులు మళ్లించి.. పల్లెలు నీరసించి!

ఖాతాల్లో నిధుల్లేక పల్లెలు నీరసించాయి. అధ్వాన పారిశుధ్యం.. గుంతలు పడిన రహదారులు.. అస్తవ్యస్త మురుగు కాలువలు.. తాగునీటి వెతలు.. వెలగని వీధి దీపాలు.. ఇలా సమస్యలు కోకొల్లలు. పంచాయతీలను అద్దంలా మెరిపిస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు, పంచాయతీరాజ్ శాఖామంత్రి పవన్ కళ్యాణ్ ఆర్భాటంగా ప్రకటనలు చేశారు. ఆరు నెలల కిందట విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.38 కోట్లను ప్రభుత్వం మళ్లించడంతో జిల్లాలో 730 గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి నిలిచిపోయింది. ప్రస్తుతం వసూలు చేస్తున్న పన్నులతోనే అరకొర అవసరాలు తీర్చుకుంటున్నామని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- 15వ ఆర్థిక సంఘం నిధుల మళ్లింపు
- జిల్లాకు మంజూరైన సుమారు రూ.38 కోట్లు
- నిధులు రాక కుంటుపడిన అభివృద్ధి
- జిల్లాలో 200 మైనర్ పంచాయతీలకు ఈ నిధులే దిక్కు
- పల్లెపండుగ పేరుతో ఆర్భాటం
- రూ.140 కోట్లు కేటాయిస్తున్నామంటూ ప్రకటన
- సకాలంలో పనులు పూర్తిచేసినా డబ్బులివ్వని ప్రభుత్వం
- అప్పులపాలు అవుతున్నామంటూ కాంట్రాక్టర్ల ఆవేదన



సాక్షి ప్రతినిధి, ఒంగోలు: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పార్టీల నేతలు చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్ గ్రామ పంచాయతీలను బలోపేతం చేస్తామని, కేంద్రం నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధులను ఇతర అవసరాలకు మళ్లించకుండా గ్రామ పంచాయతీలకే నేరుగా పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఆ హామీని తుంగలో తొక్కి గ్రామ పంచాయతీల నడ్డివిరిచే ప్రయత్నం చేస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. జిల్లాలో 730 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గ్రామ పంచాయతీలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు 15వ ఆర్థిక సంఘం నిధులను రెండు విడతలుగా అందజేస్తున్నారు. ఈ నిధులతో రోడ్లు, కాలువలు తదితర అభివృద్ధి పనులతో పాటు పంచాయతీలలో పారిశుధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారం, ఇతర అవసరాలకు ఉపయోగించాల్సి ఉంటుంది. అంతేగాకుండా ఇంటి పన్ను, వ్యాపారుల నుంచి వసూలు చేసే వాణిజ్య పన్నులతో పాటు భూముల రిజిస్ట్రేషన్ ఫీజు, గ్రంథాలయం, మైనింగ్, ఇసుకపై విధించే సెస్‌లను గ్రామ పంచాయతీలకు కేటాయించాల్సి ఉంది. కానీ, కూటమి ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు కేటాయించాల్సిన నిధులను కూడా సక్రమంగా ఇవ్వకుండా జాప్యం చేస్తోందని, దీంతో నిధుల కొరతతో ఇబ్బందులు పడుతున్నామని సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.38 కోట్లు విడుదల కావాల్సి ఉంది. అయితే, వాటిని ప్రభుత్వం దారి మళ్లించింది. ఇక వివిధ రకాల పన్నుల ద్వారా వసూలవుతున్న వాటితో అరకొరగా పనులు చేపడుతున్నామని వాపోతున్నారు. ఇతర విభాగాలు రిజిస్ట్రేషన్ ఫీజు, గ్రంథాలయం, మైనింగ్, ఇసుక సెస్‌ల ద్వారా రావాల్సిన నిధులు కూడా పంచాయతీలకు దక్కడంలేదు.

మైనర్ పంచాయతీలకు కేంద్రం నిధులే దిక్కు..

జిల్లాలో 730 పంచాయతీలుండగా, అందులో సుమారు 38 మేజర్ పంచాయతీలు ఉన్నాయి. మిగిలిన 692 మైనర్ పంచాయతీలు. మేజర్ పంచాయతీల్లో ఇంటి పన్ను, నీటి పన్ను, వృత్తి పన్ను, వాణిజ్య పన్ను కింద సంవత్సరానికి పంచాయతీ సామర్థ్యాన్ని బట్టి రూ.50 లక్షల నుంచి రూ.1.20 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది. వీటిని పారిశుధ్యం, తాగునీటి సరఫరా, బ్లీజింగ్, తదితర అత్యవసర పనులకు వెచ్చించాల్సి వస్తోంది. వీటికి 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా తోడైతే పంచాయతీలు ఆర్థికంగా బలోపేతమవుతాయి. సుమారు 200 పంచాయతీలు కేవలం ఆర్థిక సంఘం నిధుల పైనే ఆధారపడాల్సిన దుస్థితి ఉంది. ఈ పంచాయతీల్లో అరకొరగా వసూలవుతున్న పన్నులను పంచాయతీ సిబ్బంది అవినీతికి పాల్పడి స్వాహా చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ నిధుల దుర్వినియోగంపై రాజకీయ దురుద్దేశంతో గ్రామ సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేస్తారే తప్ప.. అవినీతికి కారకులైన అధికారులపై మాత్రం చర్యలు ఉండవన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

పల్లె పండుగ నిధులు వచ్చేనా.?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్భాటంగా పల్లె పండుగ కార్యక్రమం చేపట్టింది. ఇందుకు జిల్లాకు రూ.140 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో జిల్లాలోని 1160 పనులు చేపట్టాలని అధికారులు ప్రతిపాదనలు చేశారు. గ్రామాల్లో రోడ్లు, మురుగు కాలువలు నిర్మించేందుకు ఈ నిధులు కేటాయించారు. ఈ పథకం ద్వారా చేపట్టే పనులకు అక్టోబర్ 14వ తేదీ నుంచి శంకుస్థాపన చేసి ప్రారంభించారు. డిసెంబరు నెలాఖరుకల్లా పనులు పూర్తి చేశారు. పనులు పూర్తి చేసి సుమారు 9 నెలలు కావస్తున్నా నేటికీ డబ్బులివ్వకపోవడంతో పనులు చేసిన కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. కొంతమందయితే అప్పులు చేసి మరీ పనులు చేశారు. నేటికీ నిధులు మంజూరు కాకపోవడంతో అప్పులపాలయ్యామని, వచ్చే ఆదాయం వడ్డీకి కూడా సరిపోదని, దీంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీలలో ప్రతి మూడో శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్న ఆదేశాలు జిల్లాలోని ఒక్క పంచాయతీలో కూడా అమలవుతున్న దాఖలాలు లేవని ప్రజలు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం మమ్మల్ని ఉద్ధరిస్తుందని ఆశపడ్డామని, చివరికి మమ్మల్ని అప్పుల పాలు చేసిందని గ్రామ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీలలో నిధులున్నా.. లేకపోయినా తాగునీటి సరఫరా, వీధిలైట్లు, బ్లీజింగ్ వంటి ముఖ్య అవసరాలు తీర్చాల్సి ఉందన్నారు. ఇందుకోసం ప్రభుత్వం నిధులు ఇచ్చేదాక చూస్తూ ఊరుకోలేమని, అప్పు చేసైనా ప్రజల ఇబ్బందులు తీర్చి నిధులు వచ్చిన తర్వాత అప్పులు చెల్లించాల్సి వస్తోందన్నారు. కూటమి ప్రభుత్వాన్ని నమ్ముకుంటే మాకు చిప్ప కూడు తప్పదని గ్రామ సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ఆత్మ గౌరవం- ఆత్మ విశ్వాసం అంటూ ఊదర గొట్టిందే తప్ప చివరికి తమను అప్పులపాలు చేసిందని వాపోతున్నారు.

వాగ్దానాలు గాలికి...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర బడ్జెట్‌లో 5 నుంచి 10 శాతం నిధులు గ్రామ పంచాయతీలకు కేటాయిస్తామన్నారు. అలాగే, గ్రామ పంచాయతీలలో వేసే భూముల లే అవుట్లకు సంబంధించి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో ఇచ్చే లే అవుట్‌లకు పూర్తిగా పంచాయతీ అనుమతితో అప్రూవల్ ఇచ్చే విధంగా నిబంధనలు సవరిస్తామని, గ్రామ సర్పంచ్‌లకు ఇచ్చే గౌరవ వేతనాన్ని 3 వేల నుంచి 10 వేల రూపాయలకు పెంచుతామని, పంచాయతీలలో జరిగే సోషల్ ఆడిట్ గ్రామ పంచాయతీలకే అప్పజెబుతామని, నిధులు నేరుగా పంచాయతీలకు కేటాయిస్తామని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ హామీలిచ్చారు. హామీలివ్వడమే తప్ప కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం పూర్తయినా ఆచరణలో ఒక్క హామీ కూడా అమలు కాలేదని గ్రామ సర్పంచ్‌లు, వార్డు సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రభుత్వ పనితీరును తీవ్రంగా విమర్శిస్తున్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయండి



కూటమి ప్రభుత్వం పంచాయతీల బలోపేతానికి ఇచ్చిన హామీలు నెరవేర్చాలి. ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖా మంత్రి పవన్‌కళ్యాణ్ తనపై గంపెడాశలు పెట్టుకున్న ప్రజాప్రతినిధులను నిరాశకు గురిచేయకుండా వెంటనే 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసి పంచాయతీల బలోపేతానికి సహకరించాలి.

– వీరభద్రాచారి, సర్పంచ్‌ల సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు

హామీలు నెరవేర్చాలి



కూటమి ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికలలో హామీలిచ్చిన విధంగా 15వ ఆర్థిక సంఘం నిధులను వెంటనే పంచాయతీలకు విడుదల చేసి బలోపేతానికి సహకరించాలి. గ్రామ సర్పంచ్‌లకు ఇవ్వాల్సిన గౌరవ వేతనం నిధులు వెంటనే విడుదల చేయాలి. గౌరవ వేతనాన్ని సార్వత్రిక ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం 3 వేల నుంచి 10 వేల రూపాయలకు పెంచాలి.

– బెజవాడ శ్రీరామమూర్తి, సర్పంచుల సంఘ జిల్లా అధ్యక్షుడు

పీ-4కు 74 వేల కుటుంబాల గుర్తింపు

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: పీ-4 పథకంలో జిల్లావ్యాప్తంగా 74 వేల కుటుంబాలను గుర్తించినట్లు కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తెలిపారు. రహదారులు-భవనాలు, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖల పరిధిలో పనులు చేపట్టే కాంట్రాక్టర్లతో గురువారం స్థానిక ప్రకాశం భవనంలో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదరికం లేని సమాజాన్ని రూపొందించటంలో కాంట్రాక్టర్లు కూడా కలిసిరావాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం పీ-4 పథకంలో మార్గదర్శకులుగా నిలవాలని కోరారు. పీ-4 పథకం గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జెడ్పీ సీఈవో చిరంజీవి వివరించారు. సమావేశంలో సీపీవో స్వరూపారాణి, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు, ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ రవినాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు...

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టడంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నిర్మూలనకు చేపట్టాల్సిన చర్యలపై గురువారం ఉదయం ఒంగోలులోని కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు సజావుగా నిర్వహించి మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మధుసూదనరావు, జెడ్పీ సీఈవో చిరంజీవి, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు, ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి, జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్ కుమార్, ఐసీడీఎస్ పీడీ సువర్ణ, డీఆర్‌డీఏ పీడీ నారాయణ, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, బీసీ వెల్ఫేర్ అధికారి నిర్మలజ్యోతి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి వరలక్ష్మి, డీడీ మైన్స్ రాజశేఖర్, జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల కమిషనర్లు పాల్గొన్నారు.



పీ-4 పథకం సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

పోలీసుల సేవలు ప్రజలకు చేరువ కావాలి

- గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

ఒంగోలు సిటీ: పోలీసుల సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అన్నారు. స్థానిక జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని వివిధ విభాగాల్లో గురువారం వార్షిక తనిఖీలను ఐజీ నిర్వహించారు. ముందుగా ఎస్పీ దామోదర్ స్వాగతం పలకగా, పోలీస్ సిబ్బంది గార్డ్ ఆఫ్ హానర్ డ్రిల్ నిర్వహించారు. సిబ్బంది నుంచి ఐజీ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయ పరిసరాలను ఐజీ పరిశీలించారు. వివిధ సెక్షన్లలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. వారి విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. తనిఖీల్లో ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ రమణకుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా పోలీసు కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రామ్మోహన్‌రావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ దేవప్రభాకర్, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ, ఎస్సీ, ఎస్టీ సెల్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, సీఐలు విజయకృష్ణ, నాగరాజు, ఎం.శ్రీనివాసరావు, శ్రీకాంత్ బాబు, సుధాకర్, జగదీష్ పాల్గొన్నారు.

ఆగస్టు 17, 18 తేదీల్లో రాష్ట్ర మహాసభలు

- ఏపీ గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘ రాష్ట్ర కార్యదర్శి పెద్దబ్బాయి

ఒంగోలు సిటీ: ఏపీ గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘ 7వ రాష్ట్ర మహాసభలు ఆగస్టు 17, 18 తేదీల్లో ఒంగోలులో నిర్వహించనున్నట్లు రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి తెలిపారు. గురువారం ఏపీ గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీ ఆంజనేయులు అధ్యక్షతన ఒంగోలులోని ఎల్‌బీజీ భవనంలో నిర్వహించారు. రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి మాట్లాడుతూ వృత్తి రక్షణ, వృత్తిదారుల సంక్షేమం, సమస్యలపై రాష్ట్ర మహాసభలలో చర్చించి సమగ్ర కార్యాచరణ రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో వ్యవసాయానికి అనుబంధంగా గొర్రెలు, మేకల పెంపకం ఉందన్నారు. రాష్ట్రంలో రెండు కోట్ల 21 లక్షల గొర్రెలు, మేకల సంపద ఉందని, ఐదు వేలకుపైగా పెంపకందార్ల సహకార సంఘాలు ఉన్నాయని, సుమారు నాలుగు లక్షల కుటుంబాలపైగా ఈ రంగంపై ఆధారపడి బతుకుతున్నాయని తెలిపారు. గ్రామీణ స్థాయిలో సొసైటీలు, జిల్లా స్థాయిలో యూనియన్లు, రాష్ట్రాల్లో ఫెడరేషన్ ఏర్పాటు చేశారుగానీ, వాటికి తగిన నిధులను ప్రభుత్వాలు కేటాయించడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సరం దాటిపోయినా.. ఈ రంగంపై తగినంత దృష్టి పెట్టలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. మానవ సమాజానికి బలమైన, నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్న కీలకమైన రంగాన్ని ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ప్రతి సంవత్సరం ఈ వృత్తి నుంచి ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నప్పటికీ ఈ రంగానికి తగిన నిధుల కేటాయింపులు లేవన్నారు. ఇంకా అనేక సమస్యలున్నాయని, వీటన్నింటిపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని గొర్రెలు, మేకల కాపర్లను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి తోట తిరుపతిరావు, రాష్ట్ర బాధ్యులు పూసపాటి వెంకట్రావు, రాష్ట్ర కమిటీ నాయకులు బుర్రి ఆంజనేయులు, జయరాం, తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర మహాసభల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

క్లుప్తంగా

గుర్రం జాషువాకు ఘన నివాళి


జాషువా విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

ఒంగోలు వన్‌టౌన్: గుర్రం జాషువా 54వ వర్ధంతి కార్యక్రమాన్ని ప్రకాశంభవన్ ప్రాంగణంలోని గుర్రం జాషువా కాంస్య విగ్రహం వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఆర్‌ఓ చిన్న ఓబులేషు, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్ లక్ష్మా నాయక్, నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొని విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జాషువా గురించి వివరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ, కత్తి కళ్యాణ్, ఎర్రజాశాస్త్రి, కార్యాలయం పర్యవేక్షకులు డి.మధుసూధన్‌రెడ్డి, ఒంగోలు సహాయ సంక్షేమ అధికారి రబియా బేగం, సంక్షేమ అధికారి డి.అంకబాబు, సీహెచ్ సరితాదేవి, తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుల లోడు లారీ బోల్తా


రోడ్డు మార్జిన్‌లో పడిపోయిన లారీ

కంభం: బొగ్గు లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటన మండలంలోని జంగంగుంట్లలో గురువారం ఉదయం జరిగింది. వివరాల్లోకి వెళితే..రాజమండ్రి నుంచి అనంతపురానికి బొగ్గు లోడుతో వెళ్తున్న లారీ అనంతపురం- అమరావతి జాతీయరహదారిపై జంగంగుంట్ల గ్రామం వద్ద బోల్తా పడింది. ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం లారీలో ఉన్న బొగ్గు బస్తాలను కిందకు దింపి లారీని పైకి లేపారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బైక్


108 వాహనంలో క్షతగాత్రుడు వెంకటేశ్వర్లు

పొదిలి: పెట్రోల్ బంక్ నుంచి హైవేపైకి వస్తున్న ట్రాక్టర్‌ను అదే సమయంలో రోడ్డుపై వెళ్తున్న బైక్ ఢీకొన్న సంఘటన గురువారం స్థానిక దర్శి రోడ్డులోని గ్యాస్ గోడౌన్ వద్ద చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని మల్లవరం గ్రామానికి చెందిన పిల్లి వెంకటేశ్వర్లు తన బైక్‌పై పొదిలి నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. అదే సమయంలో పెట్రోల్ బంకులో నుంచి ట్రాక్టర్ రోడ్డుపైకి వస్తుంది. రెండు వాహనాలు పరస్పరం ఢీకొనడంతో వెంకటేశ్వర్లు రోడ్డుపై పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. అధిక మొత్తంలో రక్తస్రావమైంది. క్షతగాత్రుడిని 108 వాహనంలో తొలుత పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు, మెరుగైన వైద్యం కోసం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు.



హలో.. హలో.. హలో..

..సిగ్నల్ పూర్ జనం బేజార్!

5జీ యుగంలోనూ నల్లమలలో మొబైల్ ఫోన్ కష్టాలు

- సెల్‌ఫోన్‌కు సిగ్నల్స్ అందక అల్లాడుతున్న అటవీ ప్రాంత ప్రజలు
- సమాచారం ఇవ్వాలంటే గుట్టల పైకెక్కాల్సిందే..
- అత్యవసరమైతే మనుషులతో కబురు పంపాల్సిందే..
- వైపాలెం నియోజకవర్గంలో 30కి పైగా గ్రామాల్లో 'నో నెట్‌వర్క్'

ఇస్రో నుంచి తరచూ రాకెట్లు దూసుకెళ్తున్నాయి.. గగనతలానికి ఉపగ్రహాలను మోసుకెళ్తున్నాయి.. భారత్‌కు త్వరలోనే పూర్తిస్థాయి జీపీఎస్ నావిగేషన్ సిస్టమ్ అందుబాటులోకి రానుందన్న వార్తలు హోరెత్తుతున్నాయి. మరోవైపు 5జీ సేవలను క్రమంగా గ్రామాలకూ విస్తరిస్తామని టెలికం కంపెనీలు చెబుతున్నాయి. ఇలాంటి ఆసక్తిగొలిపే మాటలు వింటే అందరూ 'ఔరా..!' అనకమానరు. కానీ యర్రగొండపాలెం నియోజకవర్గంలోని సుమారు 30 గ్రామాల ప్రజలు మాత్రం 'చాలు చాల్లే' అని పెదవి విరుస్తున్నారు!! నల్లమల అభయారణ్యంలోని ఆయా గ్రామాల్లో ఇప్పటికీ సెల్‌ఫోన్ సిగ్నల్స్ అందకపోవడయే అందుకు కారణం. మావోయిస్టుల ప్రాబల్యం అధికంగా ఉన్న సమయంలో నల్లమలలో సెల్ టవర్ల ఏర్పాటుపై ఆంక్షలు ఉండేవి. ప్రస్తుతం అలాంటి పరిస్థితులేవీ లేకపోయినా నెట్‌వర్క్‌కు అంతరాయం కలుగుతుండటంతో స్థానిక ప్రజలతోపాటు ఉద్యోగులు కూడా అవస్థలు ఎదుర్కొంటున్నారు.

పెద్దదోర్నాల:

ప్రస్తుత స్మార్ట్ యుగంలో ఎవరి చేతిలో చూసినా సెల్‌ఫోన్ దర్శనమిస్తోంది. వ్యక్తిగత అవసరాలకు, ప్రపంచ వ్యాప్తంగా జరిగే ఘటనలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు సెల్‌ఫోన్ అస్త్రంగా మారింది. కాసేపు కూడా సెల్‌ఫోన్‌ను విడిచిపెట్టలేని పరిస్థితికి జనం చేరుకున్న ఈ రోజుల్లోనూ.. కనీసం 'హలో..' అని అనలేని స్థితిలో కొన్ని గ్రామాల ప్రజలు ఉన్నారంటే వారి దయనీయ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. నల్లమల అభయారణ్యం విస్తరించి ఉండే యర్రగొండపాలెం నియోజకవర్గంలో మారుమూల ప్రాంతాలకు ఇప్పటికీ సెల్‌ఫోన్ సిగ్నళ్లు అందడం లేదు. దాదాపు 30కి పైగా గ్రామాలు, గిరిజన గూడేలు మొబైల్ నెట్‌వర్క్‌కు దూరంగా ఉన్నాయి. దీంతో చాలా మంది చెంచు గిరిజనులు మిగతా వారిలా సమాచారం అందుకోలేక అవస్థలు పడుతున్నారు. అధికారులు వచ్చి చెబితే తప్ప ప్రభుత్వ పథకాల సమాచారం వారికి తెలియడం లేదు. అత్యవసరమైన సమాచారం చేరవేయాలంటే చాలా దూరం ప్రయాణించి కొండ తిప్పలు, గుట్టలపైకి ఎక్కి సిగ్నల్ ఉన్న చోట ఫోన్ మాట్లాడాల్సిన పరిస్థితి.

కదిలితే.. సిగ్నల్ జంప్!

పెద్దదోర్నాల మండల పరిధిలోని పలు గిరిజన గూడేల్లో ప్రధానమంత్రి జన్మన్ పథకంలో భాగంగా చిలకచర్ల, నల్లగుంట్ల, చెంచుకుంట గూడేల్లో బీఎస్ఎన్ఎల్ మొబైల్ సిగ్నల్ టవర్లు ఏర్పాటు చేశారు. అవి ఆయా గూడేల పరిధికే పరిమితం కావడంతో మిగతా గూడేల గిరిజనులు సెల్ సిగ్నల్స్ అందక విలవిల్లాడుతున్నారు. మండల పరిధిలోని చింతల, తుమ్మలబైలు, రోళ్లపెంట గూడేలకు పెద్దదోర్నాల, శ్రీశైలం, ఆత్మకూరులో ఏర్పాటు చేసిన టవర్ల నుంచి అరకొరగా నెట్‌వర్క్ అందుతోంది. దీంతో ఆయా గూడేల చెంచు గిరిజనులు, అటవీశాఖలో పని చేసే స్వచ్ఛ సేవక్‌లు రెండు, మూడు కిలోమీటర్లు ప్రయాణించి ఎక్కువ ఎత్తుతో ఉన్న ప్రాంతానికి చేరుకుని తమ బంధువులు, అధికారులతో మాట్లాడాల్సి వస్తోంది. ఈ క్రమంలో సిగ్నల్స్ అందే ప్రాంతం నుంచి కొద్దిగా పక్కకు కదిలినా ఫోన్ కట్ అయిపోతోంది. మళ్లీ సిగ్నల్ అందేంత వరకు చచ్చినట్లు అక్కడే వేచి ఉండాల్సిన దుస్థితి. మరీ అత్యవసరమనుకుంటే స్వయంగా మనుషులను పంపి సమాచారం అందించాల్సిందే. ఇదిలా ఉండగా గిరిజన గూడేల్లో తరచూ జరిగే కొట్లాటలు, హత్యలు, ప్రమాదాలు బాహ్య ప్రపంచానికి వెంటనే తెలియయడం లేదు. గంటల తరబడి వేచి ఉన్నాక విషయం తెలిసినా పోలీసులు, అధికారులు చేరుకునేలోగా జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. రోడ్డు ప్రమాదాలు సంభవిస్తే ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు మైదాన ప్రాంతానికి వచ్చి చెబితే తప్ప పోలీసులకు కూడా తెలియడం లేదు.

ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు?

మొబైల్ సిగ్నల్ టవర్ల ఏర్పాటులో జాప్యం, సేవా లోపంపై మారుమూల గ్రామాల్లోని ప్రజలు, గిరిజనులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. యర్రగొండపాలెం మండలంలోని పాలుట్ల, అల్లిపాలెం, దద్దనాల, పొన్నలబైలు, గుట్టల చేనుపెంట, పుల్లలచెరువు మండలంలోని మురికిమళ్ల తండా, చెన్నపాలెం, అక్క చెరువు తండా, పెద్దారవీడు మండలంలోని కస్నూతల, సుంకేసుల, గుండంచర్ల, పెద్దదోర్నాల మండలంలోని తుమ్మలబైలు, చింతల, మర్రిపాలెం, చిన్నారుట్ల, పెద్దచేమ, పెద్దమంతనాల, కొర్రప్రోలు, చెరువుగూడెం, రోళ్లపెంటలో మొబైల్ సిగ్నల్ అందకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. చింతల, తుమ్మలబైలు, చిన్నారుట్ల గూడేల్లో టవర్ల నిర్మాణ పనులు అటవీశాఖ అభ్యంతరం వ్యక్తం చేయటంతో నిలిచిపోయాయని సమాచారం. ఈ టవర్లు అందుబాటులోకి వస్తే మరికొన్ని గ్రామాల ప్రజలకైనా 'హలో..' అనే అవకాశం దక్కుతుంది.


2 కి.మీ దూరం ప్రయాణించి అధికారులకు ఫోన్‌లో సమాచారమిస్తున్న స్వచ్ఛ సేవక్

స్మార్ట్ మీటర్లు ధ్వంసం చేద్దాం

- ఎన్నికల ముందు నారా లోకేష్ కూడా అదే చెప్పాడు
- విద్యుత్ బిల్లుల తగ్గింపులో సీఎం చంద్రబాబు ఘోరంగా విఫలం
- పెట్రోల్, డీజిల్ ధరలపై స్టేట్ ట్యాక్స్ పైసా తగ్గించలేదు
- కూటమి సర్కారు తీరుపై ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకుల ధ్వజం


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఒంగోలు సిటీ: ఇళ్లు, దుకాణాలు, పరిశ్రమలు, వ్యవసాయ బోర్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేస్తే ధ్వంసం చేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. 'స్మార్ట్ మీటర్లను పగలగొట్టండి. తెలుగుదేశం మీకు అండగా ఉంటుంది' అని ఎన్నికల సమయంలో చెప్పిన మాటను నారా లోకేష్‌తోపాటు కూటమి ప్రభుత్వ పెద్దలు మరిచి, మళ్లీ స్మార్ట్ మీటర్లు బిగించేందుకు సిద్ధమై ప్రజలను నిలువునా మోసం చేశారని ధ్వజమెత్తారు. విద్యుత్ బిల్లులు, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో చంద్రబాబు సర్కారు ఘోరంగా విఫలమైందని విమర్శించారు. గురువారం ఒంగోలులోని ఎల్‌బీజీ భవన్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, ఏఐఎఫ్‌టీయూ(న్యూ) జిల్లా కార్యదర్శి ఎంఎస్ సాయి అధ్యక్షతన ప్రజా సంఘాల ఐక్య వేదిక సమావేశం నిర్వహించారు. స్మార్ట్ మీటర్లు వద్దని, ట్రూ అప్ పేరుతో ప్రజలపై వేల కోట్ల భారాన్ని మోపే నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తే తీర్మానాలు చేశారు. ఈ నెల 26 నుంచి ఆగస్ట్ 5వ తేదీ వరకు జిల్లాలో అర్జీలు సేకరించి విద్యుత్ భవన్ వద్ద ధర్నా చేపడతామని పేర్కొన్నారు. ఈ మేరకు కరపత్రాలు, అర్జీలు ఆవిష్కరించారు.

సమావేశంలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు మాట్లాడుతూ.. విద్యుత్ బిల్లులు, ఇంధన ధరలు తగ్గిస్తానన్న హామీని సీఎం చంద్రబాబు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ట్రూఅప్ చార్జీల పేరుతో రాష్ట్ర ప్రజలపై రూ.19 వేల కోట్లకు పైగా భారం మోపారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు ధ్వజమెత్తారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్లు అన్ని రకాలుగా ప్రజలకు నష్టదాయకమన్నారు. సమావేశంలో దామా శ్రీనివాసులు, కౌలు రైతు సంఘ జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య, పౌర సంఘాల సమాఖ్య నాయకులు జి.రమేష్, మున్వర్ బాషా, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురాం, తంబి శ్రీనివాసులు, ఎల్.రాజశేఖర్, వీరస్వామి, రిటైర్డ్ నాయకులు జి.శేషయ్య, బీవీ రావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జజ్జూరి జయంతిబాబు, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి లలిత కుమారి, దాసరి సుందరం, తంగిరాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కంభంలో పట్టపగలే భారీ చోరీ

- భార్యభర్తలిద్దరూ పొలం పనులకు వెళ్లి వచ్చేసరికి ఇల్లు లూటీ
- 24 తులాల బంగారం, రూ.40 వేల నగదు అపహరణ


బాధితురాలితో మాట్లాడుతున్న సీఐ, ఎస్సై

కంభం: కంభంలో పట్టపగలే దుండగులు రెచ్చిపోయారు. స్థానిక కాపవీధిలో గురువారం మధ్యాహ్నం 24 తులాల బంగారం, రూ.40 వేల నగదు అపహరించారు. వివరాల్లోకి వెళితే.. కాపవీధిలో నివాసం ఉంటున్న మద్దూరి పుల్లయ్య అతని భార్య రంగలక్ష్మమ్మ గురువారం ఉదయం పొలం పనులకు వెళ్లారు. మధ్యలో 11 గంటల సమయంలో పుల్లయ్య ఇంటివద్దకు వచ్చి వెళ్లాడు. ఆ తర్వాత తిరిగి మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇంటికి రాగా ఇంటి తలుపు తెరిచి ఉండటం గమనించాడు. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులన్నీ చిందరవందరగా కనిపించాయి. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న కంభం సీఐ కె. మల్లికార్జున, ఎస్సై నరసింహారావు చోరీ జరిగిన గృహాన్ని పరిశీలించి క్లూస్‌టీంను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. బాధితులతో మాట్లాడి వివరాలు సేకరించారు. పుల్లయ్యకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉండగా ఒక కుమారుడు హైదరాబాద్‌లో, మరో కుమారుడు విజయవాడలో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసుకుంటున్నారు. త్వరలో బంధువుల పెళ్లి ఉండటంతో ఇద్దరు కొడుకులు, కోడళ్ల నగలు తీసుకువచ్చినట్లు పుల్లయ్య తెలిపాడు. పెళ్లయిన తర్వాత నగలు బ్యాంకులో పెట్టి పొలం పెట్టుబడులకు డబ్బులు తెచ్చుకుందామనుకునే లోపే ఇలా జరిగిందని బాధితుడు వాపోయాడు. బీరువాలో సుమారు 24 తులాల బంగారు నగలుతో పాటు పొలం పెట్టుబడుల కోసం తెచ్చి పెట్టుకొని ఉన్న రూ. 40 వేల నగదు అపహరించుకెళ్లినట్లు బాధితులు తెలిపారు.

పట్టపగలే చోరీతో భయభ్రాంతులు

కాపవీధిలో నివాసం ఉండే వారంతా రైతులు, పొలం పనులకు వెళ్లే వారు కావడంతో నిత్యం అక్కడి వారు బయట అరుగుల మీద కూర్చొని మాట్లాడుకుంటుంటారు. పట్టపగలే చోరీ జరగడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటి వరకు ఈ ప్రాంతంలో దొంగతనాలు జరగలేదని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలిస్తూ చోరీకి పాల్పడిన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు రాత్రిళ్లు గస్తీ తిరుగుతుంటే దొంగలు పగటి పూట చేతివాటం చూపిస్తుండటం ఆందోళన కలిగిస్తోందని, దొంగతనాల నివారణకు పోలీసులు పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బస్టాండు సమీపంలో పర్సు చోరీ

స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో ఓ మహిళ సంచిని కట్ చేసిన వ్యక్తి అందులోని పర్సును అపహరించుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. పర్సులో సుమారు రూ. 8 వేల నగదు ఉన్నట్లు సమాచారం.

మూగజీవాల అపహరణ..?

- వారం వ్యవధిలో మేతకు వెళ్లిన సుమారు రూ.18 లక్షల విలువైన 16 గేదెలు మాయం
- పశువులను వాహనాల్లో ఎక్కించి తీసుకెళ్లిన ఆనవాళ్లు


కొండపాలెంలో పశువులను అపహరించినట్లు భావిస్తున్న ప్రదేశం

మర్రిపూడి: మేతకు వెళ్లి మూగజీవాలను అపహరిస్తున్నారు. వారం రోజులుగా మండల పరిసరాల్లో ఈ సంఘటనలు చోటుచేసుకున్నాయి. వివరాలలోకి వెళితే..మర్రిపూడి పరిసర గ్రామాల్లో వేసవిలో పచ్చదనం కరువు అవుతుంది. ఈ క్రమంలో పచ్చిమేతకోసం గ్రామాల్లోని మూగజీవాలను పొలాలకు విడిచిపెడతారు. ఎవరూ వాటిని కాపలా కాయరు. ఇది అనాదిగా వస్తోంది. పశువులన్నీ సమీపంలోని పచ్చిక దొరికే కొండ ప్రాంతానికి వెళ్లి మేతమేసి సాయంత్రానికి ఇళ్లకు చేరతాయి. వీటిలో సూడు, పాలిచ్చేవి, ఎడగేదెలు, ఏడాది వయస్సు పైబడిన దూడలన్నింటినీ మేతకోసం పొలానికి తోలుతుంటారు. ఇలా పశువులు మేతకోసం వెళ్లే క్రమంలో గమనించిన అక్రమార్కులు వాటిని అవి సంచరించే ప్రదేశం నుంచి గుట్టుచప్పుడు కాకుండా వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలించి అమ్మి సొమ్ము చేసుకుంటున్నట్లు పశుకాపరులు భావిస్తున్నారు. గత కొంత కాలంగా మేతకు వెళ్లిన పశువులు ఎంతకు ఇంటికి తిరిగిరాకపోవడంతో వెతుకులాట ప్రారంభించారు. ఈ క్రమంలో పశువులు మేతమేసే మేతపోరంబోకు భూముల్లో పశువులను ఒక గట్టుపైకి తరలించి అక్కడి నుంచి బలవంతంగా వాహనాల్లోకి ఎక్కించి తరలించినట్లుగా వాహనాల ఆనవాళ్లను గుర్తించారు. ఇటీవల వర్షాలు పడుతుండటంతో వాహనాల చక్రాల అనవాళ్లు, పశువులను వాహనాల్లో ఎక్కించే క్రమంలో అవి ఏవిధంగా ప్రవర్తిస్తాయో వాటికాలిముద్రలు, పేడ వంటివి ఆ ప్రాంతంలో కనిపించాయి. గతంలో కూడా గంగపాలెం, రేగలగడ్డ, మర్రిపూడి, పొట్టిరెడ్డిపాలెం, రాజుపాలెం, గుండ్లసముద్రం, వల్లాయపాలెం తదితర గ్రామాలకు చెందిన గేదెలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు బాధితులు తెలిపారు. మర్రిపూడి తూర్పుబజారులో సుమారు 10 గేదెలు, పడమటి బజారులో 6 గేదెలు వారం రోజులుగా మేత కోసం వెళ్లి కనిపించలేదు. వీటి విలువ రూ.18 లక్షలకు పైగా ఉంటుంది. దీంతో గురువారం వెతుకులాట ప్రారంచారు. ఈ క్రమంలో లక్ష్మీనృసింహస్వామి కొండ సమీపంలోని అడివిబీడులోని ఓ ఎత్తయిన ప్రదేశంలో గుర్తు తెలియని వ్యక్తులు రెండు వాహనాల్లో వచ్చి గేదెలను అపహరించుకుపోయిన ఆనవాళ్లను గుర్తించారు. కొండప్రాంతంలో అక్రమంగా వాహనాల్లో ఎక్కించుకున్న గేదెలను పొదిలి, కంభాలపాడుగ్రామాల వైపు తరలించినట్లుగా ఆనవాళ్లు ఉన్నట్లు వారు భావిస్తున్నారు. బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో, సీసీ పుటేజ్‌ల పనుల్లో పోలీసులు నిమగ్నమయ్యారు.

మొక్కుబడిగా కేంద్ర బృందం పర్యటన


మహిళలతో మాట్లాడుతున్న కేంద్ర అధికారులు

పొదిలి రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పరిశీలించడానికి వచ్చిన అధికారుల పర్యటన మొక్కుబడిగా సాగింది. గురువారం పొదిలి మండలంలోని ఓబులక్కపల్లిలో ఎన్ఎల్ఎం సెంట్రల్ టీమ్ సభ్యులు ప్రభాత్ శర్మ, నందలాల్‌గుల్జార్ పర్యటించారు. ఉదయం 10 గంటలకు రావాల్సి ఉండగా మధ్యాహ్నం 12.50 గంటలకు గ్రామానికి చేరుకున్నారు. ముందుగా సిద్ధం చేసుకున్న ప్రణాళిక ప్రకారం 10 నిమిషాలపాటు డ్వాక్రా గ్రూపులోని ఐదుగురు సభ్యులతో మాట్లాడారు. మీకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలతో వ్యాపారం బాగా సాగుతోందా, లాభాలు ఎలా ఉన్నాయి, ఆర్థికంగా ఎదిగారా? అని ప్రశ్నించగా గ్రూపు సభ్యులు మౌనంగా ఉండిపోయారు. అనంతరం అంగవైకల్యం, వితంతువు, మానసిక రోగి అయిన ముగ్గురు పింఛనుదారులతో మాట్లాడి ముందుకు కదిలారు. ఈ సమయంలో కొంతమంది మహిళలు గ్రామంలో తాగునీరు రావడం లేదని కేంద్ర బృందం దృష్టికి తీసుకురాగా కలెక్టర్‌కు తెలియజేస్తామని చెప్పారు. షెడ్యూల్ ప్రకారం సీసీ రోడ్లు, వాటర్ ట్యాంకుల నిర్మాణం, ఉపాధి హామీ పనులను అధికారులు పరిశీలించాల్సి ఉంది. అయితే తూతూ మంత్రంగా సమావేశం ముగించుకుని వెళ్లే దారిలో ఫారం పాండ్ పనులను పరిశీలించి మమ అనిపించారు. మొత్తం మీద తొలిరోజు కేంద్ర బృందం పర్యటన గంట సేపు మాత్రమే సాగింది. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీడీ లక్ష్మీరెడ్డి, డ్వామా ఏపీడీ బసవ సుబ్బారావు, ఎంపీడీఓ గుత్తా శోభన్‌బాబు, ఏపీఓ మహాలక్ష్మి, ఏపీఎం గోపాలకృష్ణ, పీఆర్ ఏఈ రామకృష్ణ పాల్గొన్నారు.

ఎంపీడీఓపై లైంగిక వేధింపుల కేసు

తర్లుపాడు: ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్ తనతో అసభ్యంగా ప్రవర్తించినట్లు మండల పరిషత్ కార్యాలయంలో స్వీపర్‌గా పనిచేస్తున్న మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై బ్రహ్మనాయుడు తెలిపారు. కార్యాలయంలో గత కొన్నేళ్లుగా స్వీపర్‌గా పని చేస్తున్న తనను బుధవారం ఎంపీడీఓ పిలిచి ×బాత్రూం నీట్‌గా కడగలేదేంటి₹ అంటూ అసభ్యంగా ప్రవర్తించారని, పెనుగులాటలో తన గాజులు కూడా పగిలాయని స్వీపర్ తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై వివరించారు.